
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

3

బుధవారం 16 జూలై 2025





రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్ఎం సుధేష్ణసేన్

సా..గుతున్న పనులపై ఆగ్రహం

గడువులోగా పూర్తి చేయాలని ఆదేశాలు

వినుకొండ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం తనిఖీలు

వినుకొండటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది నుంచి పనులు చేస్తున్నా కొలిక్కిరాక పోవడం.. ప్రయాణికులకు అసౌకర్యంగా ఉండటం.. వినియోగిస్తున్న నిర్మాణ సామగ్రిలపై డీఆర్ఎం సుధేష్ణసేన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండలో జరుగుతున్న అమృత్‌భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను డీఆర్ఎం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరుపై మండిపడ్డారు. ప్లాట్‌ఫారాలకు ఉపయోగిస్తున్న పాలీష్, మెటల్ రాళ్లను పరిశీలించి కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువు లోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. మొదటి ప్లాట్‌ఫారం పైకప్పు కుంగి ట్రాక్‌పై పడటం, ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలిగించేలా సామగ్రి ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పొరపాట్లు జరిగితే సహించేది లేదని అధికారులకు సూచించారు. నడికుడి నుంచి దర్శి వరకు రైలు రాకపోకలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

ఏడాదిగా నత్తనడకన పనులు

వినుకొండ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు ఏడాదిగా నత్తనడకన సాగుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా సుమారు రూ.10 కోట్లతో చేపట్టిన పనులకు గత సంవత్సరం ఫిబ్రవరి 24న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గత ఆర్థికసంవత్సరం చివరికి పనులు పూర్తి చేయాలి. అయితే గడువు దాటి రెండు నెలలైనా ఇప్పటివరకు పనులు కొలిక్కి రాలేదు. నత్తనడకన పనులు జరుగుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్లాట్‌ఫారాలపై 500 మీటర్ల పొడవున చేపట్టిన రేకుల షెడ్ నిర్మాణం ఇప్పటివరకు పూర్తికాలేదు. అధికారుల పర్యవేక్షణా లోపంతోనే పనుల్లో జాప్యం జరుగు తుందన్న విమర్శలు వస్తున్నాయి. రైల్వే స్టేషన్‌లో లిఫ్టులు, కోచ్ పొజిషన్ డిస్‌ప్లే బోర్డులు పనిచేయడంలేదు.



నత్తనడకన సాగుతున్న రైల్వేప్లాట్‌ఫారం పైకప్పు పనులు

చినుకు చింత

వరుణుడు కరుణించడం లేదు. ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ముందస్తు వర్షాలు మురిపించి మాయమయ్యాయి. ఖరీఫ్ కరిగిపోతోంది. జూలై మధ్యలోకి వచ్చినా మేఘాలు కనుచూపు మేరలో కనిపించడంలేదు. రైతులు పొలాలు దున్ని చినుకు కోసం ఆకాశానికేసి ఆశగా చూస్తున్నారు. జిల్లాలోని 27 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఖరీఫ్ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే సాగు చేసిన పత్తి పంట బెట్టకువచ్చింది. వచ్చే 15 రోజులు సాగుకు అత్యంత కీలకం.. అప్పటికీ సరైన వర్షాలు కురవకుంటే పరిస్థితులు తీవ్రంగా ఉండనున్నాయి.





ఎండిపోతున్న పత్తి

● 27 మండలాల్లో వర్షాభావం ● 68.1 శాతం లోటు వర్షపాతం ● రైతులను నిరాశపరిచిన నైరుతి ● జిల్లాలో పంటల సాగు 4 శాతమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లా అంతటా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకున్నాయి. సాగుకు అన్ని విధాల సమాయత్తమైన రైతులను నైరుతి రుతుపవనాలు నిరాశపరుస్తున్నాయి. పంటలకు జూలై నెల అత్యంత కీలకం. అయితే ఈ నెలలో జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లో చినుకు రాలలేదు. అతి లోటు వర్షపాతం నెలకొనడంతో పంటల సాగు సందిగ్ధంలో పడింది. జిల్లా సాధారణ సగటు 143.9 మీమీ కాగా 45.9 మీమీ వర్షపాతం నమోదైంది. 68.1 శాతం లోటు వర్షపాతం నెలకొంది. వర్షాభావంలో రాష్ట్రంలోనే జిల్లా మూడో స్థానంలో నిలిచింది. 28 మండలాలకు ఒక్క మాచర్ల మండలంలో అదీ జూన్ మొదటి వారంలో సాధారణ వర్షపాతం నమోదైంది. అయినా పంటల సాగుకు అనుకూలంగా ఇక్కడ వర్షాలు కురవలేదు. జిల్లాలో 4.53 లక్షల ఎకరాలకు 16,005 ఎకరాల్లో మాత్రమే పంటలను రైతులు సాగు చేశారు. పత్తి సాధారణ విస్తీర్ణం 2,28,915 ఎకరాలు కాగా 15,883 ఎకరాల్లో మాత్రమే సాగైంది. పత్తి సాగుకు కూడా అదును తప్పుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెలలో వర్షాలు కురవకపోతే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేలా వ్యవసాయాధికారులు చర్యలు చేట్టాల్సి ఉంది. వర్షాల కోసం గ్రామాల్లో రైతులు వరుణుడికి పూజలు చేస్తున్నారు.

వర్షపాతం వివరాలు (మీమీలలో)

మండలం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం	లోటు శాతం
నకరికల్లు	150.2	9.0	94.0
ముప్పాళ్ల	174.7	16.3	90.7
సత్తెనపల్లి	176.7	28.0	84.2
శావల్యాపురం	103.9	17.8	82.9
యడ్లపాడు	146.7	29.7	79.8
రాజుపాలెం	152.7	32.6	78.7
నూజెండ్ల	126.1	29.0	77.0
పిడుగురాళ్ల	148.9	36.0	75.8
నాదెండ్ల	123.9	30.2	75.6
దాచేపల్లి	135.7	34.5	74.6
పెదకూరపాడు	161.6	41.4	74.2
బొల్లాపల్లి	124.2	33.2	73.3
మాచవరం	124.0	33.4	73.1
రొంపిచర్ల	132.1	36.1	72.7
బెల్లంకొండ	161.7	44.4	72.5
కారంపూడి	155.0	48.4	68.8
నరసరావుపేట	144.0	45.3	68.5
గురజాల	182.5	62.7	65.6
వినుకొండ	103.7	36.3	65.0
దుర్గి	138.9	49.4	64.4
రెంటచింతల	139.9	51.2	63.4
ఈపూరు	115.9	44.3	61.8
వెల్దుర్తి	122.9	51.1	58.4
క్రోసూరు	183.9	77.2	58.0
అమరావతి	198.3	85.7	56.8
అచ్చంపేట	163.7	73.4	55.2
చిలకలూరిపేట	122.5	65.1	46.9

పనితీరుకు ఫలితాలే తార్కాణం

❖ యడ్లపాడు జడ్పీ పాఠశాలలో డీఈవో

యడ్లపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాధించిన ఫలితాలే ఉపాధ్యాయుల బోధన, పనితీరుకు తార్కాణంగా నిలుస్తాయని డీఈవో చంద్రకళ తెలిపారు. యడ్లపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం డీఈవో సందర్శించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన డీఈవో సమస్యలు, సౌకర్యాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనాతీరు, హాజరు, పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితరాల గురించి ఆరా తీశారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ప్రణాళికలు రూపొందించుకుని చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. అలా చదివితే పరీక్షల సమయంలో ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదన్నారు. ప్లస్ టూ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల కంటే మిన్నగా ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో ఎస్ఎం సుభాని, ఎంఈవో నాగరత్నం, హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థిని నోట్ పుస్తకాన్ని పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా డీఈవో చంద్రకళ

సీఎస్ఈ.. కావాలి

సాఫ్ట్‌వేర్ బ్రాంచీలకే డిమాండ్



- కంప్యూటర్ సైన్స్‌లో పది ఉప బ్రాంచీల ఏర్పాటు
- వెబ్ కౌన్సెలింగ్‌లో ఎక్కువ మంది విద్యార్థుల ఆసక్తి
- సివిల్, మెకానికల్ బ్రాంచీలను ఎత్తేసిన సగం కాలేజీలు

గుంటూరు(విద్య), జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీటెక్ అంటే నేటి తరం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో సాఫ్ట్‌వేర్ సంబంధిత కంప్యూటర్ సైన్స్(సీఎస్సీ) ఒక్కటే అనే భావం నెలకొంది. పెద్ద యూనివర్సిటీల నుంచి సాధారణ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎక్కడైనా విద్యార్థులు సీఎస్సీ లేదంటే ఆ పేరుతో ఏర్పాటు చేస్తోన్న ఉప బ్రాంచ్‌లపైనే నూటికి 90 శాతం మంది ఆసక్తి చూపుతున్నారు. మూడు రోజుల నుంచి ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ జరుగుతోంది. ఆదివారం నుంచి విద్యార్థులు కోర్సులు, కళాశాలలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఏఈపీసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల్లో అత్యధికమంది సీఎస్ఈ లేదంటే దాని ఉప బ్రాంచ్‌ల్లో చేరేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గుంటూరు జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర జిల్లాల విద్యార్థులు భారీ సంఖ్యలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈఏపీ సెట్‌లో 25 వేల మంది విద్యార్థులు అర్హత సాధించగా 30 వేలకు పైగా సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి వచ్చే విద్యార్థులతో పూర్తిస్థాయిలో ఇంజనీరింగ్ కళాశాలలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాగార్జున యూనివర్సిటీ(గుంటూరు), జేఎన్‌టీ యూకే(నరసరావుపేట) క్యాంపస్‌లతో పాటు 36 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. గతంలో ఆయా కళాశాలలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ తదితర బ్రాంచీలు ప్రధానంగా ఉండేవి. అయితే నాలుగైదేళ్ల నుంచి సీఎస్సీలో వచ్చిన సబ్ బ్రాంచీల కారణంగా సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపలేదు. ఒక్క సీఎస్సీలోనే దాదాపు పది ఉప బ్రాంచీలు ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో సీఎస్సీలో రెండు బ్రాంచ్‌లు

(మిగతా 4లో)

చెరువు స్థలంలో వ్యాపారం

◆ దేవాళమ్మ చెరువులో రెండు ఎకరాల ఆక్రమణ ◆ గొర్రెలమండి వ్యాపారుల కబ్జాలో రూ.10 కోట్ల స్థలం

మాచర్లటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఒక వైపు సాగర్ రహదారి మరోవైపు పట్టణ బైపాస్ రోడ్లకు మధ్యలో గొర్రెల మండి వ్యాపారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. దేవాళమ్మ చెరువుకు సంబంధించి మాచర్లలోని సాగర్ రహదారి పక్కన ఉన్న స్థలం ఎకరా రూ.5 కోట్లకుపై గానే ఉంటుంది. ఇక్కడ రెండు ఎకరాలను గొర్రెల మండి నిర్వాహకులు ఆక్రమించుకున్నారు. మాచర్ల గొర్రెల మండికి ప్రతీ శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి జీవాలు వస్తుంటాయి. క్రయ, విక్రయాలు లక్షల్లో జరుగుతుంటాయి. నిర్వాహకులు ఇక్కడ ప్రైవేటు స్థలం కొనుగోలు చేసి ప్రహరీ ఏర్పాటు చేసే సమయంలో దేవాళమ్మ చెరువును కూడా ఆక్రమించేశారు. ఈ స్థలంలో చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేసుకుని గ్రావెల్‌తో చదును చేసి వ్యాపారాలు చేస్తున్నారు. ప్రహరీ కట్టడంతో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు చెరువుకు సాఫీగా రాకుండా అడ్డంకిగా మారింది. రూ. 10 కోట్లకు పైగా స్థలం ఆక్రమణలకు గురైనా పురపాలక సంఘ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. విలువైన ఆస్తిని కాపాడడంలో పురపాలకులు, అధికారులు శ్రద్ధ చూపక పోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.



చెరువును గ్రావెల్‌తో చదునుచేసి ఆక్రమించుకున్న దృశ్యం

23 నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘం

రాష్ట్ర మహా సభలు

4

విసిరితే..వికసిస్తాయి!

● విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ ● విద్యార్థుల్లో ప్రేరణకు విశ్రాంత అధ్యాపకుడి కృషి ● ఇప్పటికే 60 వేల విత్తనాల సేకరణ ● రోటరీక్లబ్‌ల సహకారంతో విత్తన బ్యాంకుల ఆలోచన

6

4

హాస్టల్ వార్డెన్‌కు తల్లిదండ్రుల దేహశుద్ధి

● యూ ట్యూబ్‌లో విద్యార్థినులకు అసభ్యకర చిత్రాలు చూపిస్తుందని ఆరోపణ

విశ్రాంత రైల్వే గార్డు నకిలీ టీటీఈ అవతారం

● రైలు బోగీల్లో తనిఖీ చేస్తూ పట్టుబడిన వైనం..

కార్గిల్ అమర జవాను సేవలకు గుర్తింపు

● సేవా మెడల్‌తో కుటుంబ సభ్యులకు సన్మానం

ఇలాగైతే.. అతిసారమే

● డ్రెయిన్లలో కుళాయి పైపులు ● ప్రమాదమైనా పట్టించుకోని అధికారులు

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరా చేసే కుళాయి పైపులు మురికినీరు పారుదలయ్యే కాల్వల్లో ఏర్పాటు చేశారు. ఆ నీటి పైపులకు లీకులు వస్తే ఆ ప్రాంతంలోని ప్రజలు అతిసారా బారిన పడే అవకాశం ఉంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై పట్టణప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీల్లో పైపులతో ప్రజలు అనారోగ్యానికి, అతిసార వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిసినా ఎప్పుడు రోగమొస్తే.. అప్పుడే మందు బిళ్ల వేసుకుందామన్న సామెతగా మున్సిపల్ అధికారులు ఉన్నారు. లెనిన్‌నగర్, బెల్లంకొండ డొంక, ఎస్టీ కాలనీ, గుళ్లపల్లిడొంక, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో మురికి కాల్వల్లోనే మంచినీటి పైపులైన్లున్నాయి.

గతంలో పలువురికి అనారోగ్యం..

గత ఏడాది జూలై, ఆగస్టులో స్థానిక లెనిన్‌నగర్‌లో పారిశుధ్య లోపం, నీటి కలుషితం వల్ల ఎందరో అనారోగ్యానికి గురయ్యారు. పలువురు మృతి చెందారు. అప్పట్లో మున్సిపల్ మంత్రి నారాయణ కూడా ఈ ప్రాంతంలో పర్యటించి పారిశుద్యం మెరుగు పరిచేందుకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. అయినా శాశ్వతంగా సమస్యను పరిష్కరించకుండా తాత్కాలిక చర్యలతో అధికారులు సరిపెడుతున్నారు.





పిడుగురాళ్ల పట్టణంలో మురికి కాల్వలో వున్న వాటర్ పైపులైన్లు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కారంపూడిలో రూ.5 లక్షలు, పిడుగురాళ్లలో రూ.లక్ష ఎరువుల సీజ్



కారంపూడిలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ వ్యవసాయశాఖల అధికారులు

కారంపూడి, పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసా యశాఖ కమిషనరేట్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు కారంపూడి, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో విత్తన, ఎరువుల దుకాణాలు, గిడ్డంగిలపై మంగళవారం దాడులు చేసి తనిఖీలు చేశారు. కారంపూడిలోని దుకాణాల్లో స్టాకు రిజిష్టర్లు, బిల్లు పుస్తకాలు, అమ్మకం, కొనుగోలు బిల్లులు, స్టాక్ బోర్డులను పరిశీలించారు. ఓ - ఫారాలు, లైసెన్సులు పొందుపరచని కారణంగా రూ.5,01,696 విలువైన 312 ఎరువుల బస్తాలను సీజ్ చేశారు. అనుమతి లేని ఎరువులు, అధిక ధరలకు ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. అనుమతులు లేని పత్తి విత్తనాలు అమ్మితే విత్తనాల లైసెన్సులను రద్దు చేస్తామన్నారు.

పిడుగురాళ్లలోని మెగాసీడ్స్ విత్తన దుకాణంలో అధికారులు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేనికారణంగా రూ.లక్షా 11 వేల 781 విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ఆయా తనిఖీల్లో వి జిలెన్స్ సీఐ ఎన్ఎస్ఎస్ అపర్ణ, నెల్లూరి జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకుడు కన్నయ్య, మండల వ్యవసాయాధికారులు పోట్ల నరసింహారావు, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమర జవాను సేవలకు గుర్తింపు

● సేవా మెడల్‌తో కుటుంబ సభ్యులకు సన్మానం



జవాను కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందజేత..

పిట్టలవానిపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కార్గిల్ అమర వీరుడు, జవాను మహ్మద్ హాజీ బాషా కుటుంబ సభ్యులను ఆర్మీ అధికారులు మంగళవారం సన్మానించారు. కార్గిల్ ప్రాంతంలో 8 మౌంటెన్ డివిజనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఆర్మీ ప్రతినిధులు చందోలు గ్రామంలోని హాజీ బాషా నివాసానికి చేరుకున్నారు. కార్గిల్ యుద్ధంలో హాజీ బాషా సాహసానికి గుర్తింపుగా కేంద్రం సేవా మెడల్ ప్రదానం చేసింది. ఇందుకు సంబంధించిన ప్రశంసా పత్రం, మెమెంటోను ఆర్మీ అధికారులు హాజీ బాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం అమర జవాను చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ.. 1990లో జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం హాజీ బాషా తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. సంక్షేమ సంఘం తరుపున ఆర్మీ అధికారులకు ఈ సందర్భంగా స్వాగతం పలికారు. కార్గిల్ నుంచి విచ్చేసిన ఆర్మీ అధికారి ఎం.వెంకటరెడ్డి హాజీబాషా సేవలను కొనియాడారు. హవల్దార్ మేజర్ రాజేష్, కేకే హవల్దార్ చిరంజీవు బృందం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌కు తల్లిదండ్రుల దేహశుద్ధి

● విద్యార్థినుల పట్ల వ్యవహారశైలిపై ఆగ్రహం



వార్డెన్ సౌరిబాయిని చితకబాదుతున్న తల్లిదండ్రులు

కారంపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కారంపూడి ఆదర్శ పాఠశాల వసతి గృహ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తోందని తల్లిదండ్రులు మంగళవారం వార్డెన్ సౌరిబాయిని చితకబాదారు. ఆమె విద్యార్థినులకు యూ టూబ్‌లో బూతు బొమ్మలు చూపిస్తోందని ఆరోపించారు. విద్యార్థినులను బయటకు తీసుకెళ్లడమే కాకుండా.. బయట వ్యక్తులను లోపలికి తీసుకొస్తోందని, తను చెప్పింది చేయాల్సిందేనని హాస్టల్ విద్యార్థినులను బెదిరిస్తోందని తల్లిదండ్రులు వాపోయారు. అంతేకాకుండా వార్డెన్ సౌరిబాయి విద్యార్థినులు స్నానాలు చేసేటప్పుడు ఫొటోలు కూడా తీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు ఆమె వ్యవహార శైలిపై ప్రిన్సిపల్ నయోమికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. సౌరిబాయిపై గతంలో పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. పాఠశాలలో సీటు వచ్చినా.. తమ పిల్లలను హాస్టల్‌లో చేర్చాలంటే భయమేస్తోందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మోడల్ స్కూల్ నుంచి సాయంత్రం విద్యార్థినులను బయటకు పంపే సమయంలో యువత బైకులపై చక్కర్లు గొడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నా.. స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

23 నుంచి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), జూలై 15(ఆంధ్రజ్యోతి): పాత గుంటూరులోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో ఈ నెల 23, 24 తేదీల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహా సభలు నిర్వహిస్తున్నట్లు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. ఏడేళ్లుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డు లేకపోవడంతో కార్మికులకు జరుగుతున్న నష్టం, భవిష్యత్తు ప్రణాళికను ఈ మహా సభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వందలాది కార్మికులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మహా సభలకు ఆహ్వాన సంఘం చైర్మన్‌గా నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, వైస్ చైర్మన్‌గా నారెట్కో అధ్యక్షుడు పెరవలి నాగవంశీ, సహాయ కార్యదర్శిగా ప్రముఖ ఆర్కిటెక్ కె.ఎస్ కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. సభలకు బిల్డర్లు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, డి.కోటేశ్వరరావు, దీవెనరావు, వలీ, సీతారామయ్య, నిక్సన్, అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు మెరుగు పరచుకోవాలి

● జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హెని క్రిస్టినా

గుంటూరు సిటీ, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలకు ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులు నాయకత్వ లక్షణాలు మెరుగు పరచుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా సూచించారు. మహిళా నాయ కత్వంలో మార్పు - స్థానిక స్వపరిపాలనలో సాధికారత అనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె జడ్పీ కార్యాలయంలో ప్రారంభించి, ప్రసంగించారు. మహిళ నాయకత్వంలోని ఆలోచనల మార్పు ద్వారా స్థానిక పాలనలో స్వపరిపాలన సాధ్యం అని పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి బీవీ ఎన్ సాయి కుమార్ మాట్లాడుతూ మహిళా జడ్పీటీసీలు, ఎంపీపీలను పాలన వ్యవహారాల్లో మరింత బలోపేతం చేసేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు.

రెండు నిమిషాల హాల్ట్.. సరిపోవడం లేదు

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నిత్యం సాయంత్రం వేళ విజయవాడ నుంచి బయలుదేరి గుంటూరు మీదగా లింగంపల్లికి వెళ్లే 12795 ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌పై ప్రయాణికుల నుంచి రైల్వే ఉన్నతాధికారులకు తరచుగా ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఈ రైలుకు గుంటూరులో కేవలం రెండు నిమిషాల సమయం మాత్రమే హాల్టింగ్ ఉంది. సాయంత్రం 6.15 గంటలకు వచ్చి 6.17కి ఈ రైలు బయలుదేరుతుంది. ఈ రైలుకు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ రైలు తర్వాత రాత్రి 11.15 గంటల సమయం దాటేంత వరకు మరో రైలు లేదు. దీంతో ఎక్కువ మంది ఇంటర్ సిటీలో ప్రయాణిస్తున్నారు. గుంటూరులో ఇచ్చిన రెండు నిమిషాల హాల్టింగ్ సమయం ప్రయాణికులు ఆ రైలులో బోర్డింగ్ చేయడానికి సరిపోవడం లేదు. దీంతో రైలు ఎక్కలేక పలువురు వెనుదిరుగుతున్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో హాల్టింగ్ సమయం కనీసం ఐదు నిమిషాలకు పెంచేందుకు తాము ఉన్నతాధికారులకు నివేదిస్తామని కంట్రోల్ ఆఫీసు అధికారులు పేర్కొన్నారు.

విశ్రాంత రైల్వే గార్డు నకిలీ టీటీఈ అవతారం

● రైలు బోగీల్లో తనిఖీ చేస్తూ పట్టుబడిన వైనం..

నర్సరావుపేట లీగల్, జులై 15,(ఆంధ్రజ్యోతి): నకిలీ టీటీఈని నరసరావుపేట రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మచిలీపట్నం నుంచి ధర్మవరం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఈ నకిలీ టీటీఈ.. గుంటూరుకి చెందిన అసలు టీటీఈ జాన్ వెస్లీకి తారసపడ్డాడు. నకిలీ టీటీఈని గుర్తింపు కార్డు చూపాలని జాన్ వెస్లీ కోరగా.. వాదనకు దిగాడు. రైలు నరసరావుపేటకి రాగానే బయటకు దూకి పరారయ్యేందుకు యత్నించాడు. అప్పటికే.. అప్రమత్తమైన నరసరావుపేట రైల్వే పోలీసులు నకిలీ టీటీఈని అదుపులోకి తీసుకున్నారు. కొన్ని రోజులుగా టీటీఈగా చెలామణి అవుతూ.. రైళ్లలో తిరుగుతున్న అతన్ని.. అవినాష్ కృష్ణ గుప్తాగా రైల్వే పోలీసులు గుర్తించారు. అతను.. గతంలో బిలాస్ పూర్ పరిధిలో రైల్వే గార్డుగా పనిచేసి.. ప్రమాదం బారిన పడటంతో ఉద్యోగం నుంచి రిటైర్డ్ అయ్యాడని గుర్తించారు.

సీఎస్ఈ.. కావాలి

(3వ పేజీ తరువాయి)

మాత్రమే ఉండగా ప్రస్తుతం ఏఐఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉప దాదాపు పది బ్రాంచ్‌లను ఏర్పాటు చేశారు. 36 కాలేజీల్లో సగం కాలేజీల్లో సివిల్, మెకానికల్, కెమికల్ బ్రాంచీల్లో సీట్లు భర్తీ కావడం లేదు. దీంతో క్రమంగా కళాశాలలు వీటిని ఎత్తివేసి కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన బ్రాంచ్‌లను ప్రవేశపెడు తున్నాయి.

భారీ ప్యాకేజీల మోజుతో..

ఇంజనీరింగ్‌లో సీఎస్సీ, ఐటీ బ్రాంచ్‌ల్లో అత్యధికంగా విద్యార్థులు చేరడానికి కారణం భారీ ప్యాకేజీలే కారణమని అధ్యాపకులు చెబుతున్నారు. సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికి ప్రారంభ జీతం రూ.15 వేల నుంచి 25 వేల లోపు ఉంటే కంప్యూటర్ బ్రాంచీల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.75 వేల వరకు ప్రారంభ జీతం ఉంటోంది. దీనికి తోడు వైట్ కలర్ ఉద్యోగుల మాదిరి ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయవచ్చు. దీనికి తోడు ఉద్యోగులకు ఆయా సాఫ్ట్‌వేర్ కంపెనీలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఫలితంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కల్పించే బ్రాంచీల వైపే విద్యార్థులు మొగ్గ చూపుతున్నారని అధ్యాపకులు చెబుతున్నారు.

ఉపాధి అవకాశాలు ఉన్నా..

తొలుత బీటెక్‌లో మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే ఉండేవి. కంప్యూటర్ కోర్సు రావడం.. గత కొన్నేళ్లుగా విద్యార్థుల్లో నెలకొన్న పరిణామాలతో మెకానికల్, సివిల్, కెమికల్ బ్రాంచీల్లో నిరాదరణకు గురయ్యాయి. ప్రధానంగా ఆయా బ్రాంచీల్లో డిగ్రీలు చేస్తే ఉపాధి కష్టమన్న భావన విద్యార్థుల్లో నెలకొందని కళాశాలల ప్రిన్సిపాల్స్ చెప్తున్నారు. కానీ ఇది వాస్తవం కాదంటున్నారు. సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు నిర్మాణ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయి. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ప్లాంట్లలో అత్యధిక గంటలు నిల్చొని పనులు చేయాల్సి ఉంటుంది. ఏసీ గదుల్లో కూర్చుని పనిచేయడానికి అవకాశాలు చాలా తక్కువ కావడంతో ఈ బ్రాంచ్‌లకు విద్యార్థుల నుంచి డిమాండ్ తగ్గింది.

అమ్మకు.. ఆషాఢం సారె



అమ్మవారికి సారెను తీసుకొస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గ అమ్మవారు

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కనకదుర్గ అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించేందుకు మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి సారె అందజేసి, మొక్కులు చెల్లించుకొన్నారు. దేవాలయంలో కుంకుమ పూజ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

● తనను రెండో పెళ్లి చేసుకున్నాడని ప్రచారం చేస్తుండటమే కారణం

● పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదపలకలూరు శివారు పొలాల్లో ఈ నెల 12న జరిగిన సత్తెనపల్లికి చెందిన మన్నెబోయిన పద్మావతి (50) హత్య కేసులో మిస్టరీ వీడింది. ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న క్రోసూరు మండలం పీసపాడు గ్రామానికి చెందిన ముండ్లమూరు సూర్యనారాయణరెడ్డి ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. తనను సూర్యనారాయణరెడ్డి రెండో పెళ్లి చేసుకున్నాడని ప్రచారం చేస్తుండడంతో.. విసుగు చెంది ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు సూర్యనారాయణరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాడీపేటకు చెందిన పద్మావతి భర్త బ్రహ్మం ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆమె కూతురుకు గతంలోనే వివాహమైంది. పద్మావతి కొద్ది సంవత్సరాలుగా సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసం ఉంటోంది. పద్మావతి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది. ఇదిలా ఉంటే కొద్ది సంవత్సరాలుగా పీసపాడు గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డితో పద్మావతికి వివాహేతర సంబంధం ఉంది. కాగా సూర్యనారాయణ రెడ్డి గుంటూరులో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఓ కళాశాల హాస్టల్‌లో అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే తరచూ పద్మావతి సూర్యనారాయణ రెడ్డి కోసం హాస్టల్ వద్దకు వెళుతూ ఉండేది. అంతేగాక సూర్యనారాయణరెడ్డి తల్లికి ఫోన్ చేసి అత్తయ్య అని పిలిచేది. అదేవిధంగా సూర్యనారాయణ రెడ్డి తనను రెండో పెళ్లి చేసుకున్నాడని అందరికీ ప్రచారం చేస్తూ ఉండేది. దీంతో పద్మావతి ప్రవర్తనతో విసుగు చెందిన సూర్యనారాయణరెడ్డి నమ్మకంగా ఆమెకు ఫోన్ చేసి పెదపలకలూరు పొలాల వద్దకు పిలిపించి ఆమె మెడకు పైట చెంగుతో మెడకు బిగించి.. హత్య చేశాడు. ఈ మేరకు నమోదు అయిన కేసులో నల్లపాడు పోలీసులు సూర్యనారాయణ రెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళ వారం నాటికి 556.60 అడుగులు ఉంది. ఇది 224.55 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1,650, మొత్తం ఔట్‌ఫ్లో 1,650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 64,789 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 15.12 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 4,600, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం ఐదు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	98, 107, 118
చికెన్ విత్ స్కిన్(కిలో)	190.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	200.00

52,228 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,761 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,228 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,478 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13400	273	---	----
4884	----	---	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13600	తేజ	10000	13500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4600	7000

ఓర్వలేక వైసీపీ నేతలు..

పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ ఏడాది పాలన చూసి ఓర్వలేక.. ఇక భవిష్యత్‌లో అధికారంలోకి రాలేమని భావించిన వైసీపీ నేతలు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓదార్పు యాత్రలు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కొత్తకాదని తెలిపారు. ఏదో రకంగా ప్రభుత్వాన్ని రెచ్చగొట్టి తప్పుడు కేసులు పెట్టించుకొని సానుభూతి పొందాలని చూస్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో రాజధాని అమరావతిని పూర్తిగా అడవిగా మార్చారని, వైసీపీ పాడు చేసి వెళ్లిన రాజధానిని నేడు బాగుచేసుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు అవాకులు చవాకులు తగ్గించుకుంటే మంచిదని హితవు పలికారు. రాబోయే రోజుల్లో అభివృద్ధి చెందిన రాజధానిని చూడబోతున్నామన్నారు.

తురకా కిశోర్‌కు రిమాండ్



కోర్టు నుంచి తురకా కిశోర్ తీసుకెళ్తున్న పోలీసులు

మాచర్ల టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్, వైసీపీ నాయకుడు తురకా కిశోర్‌కు హత్యాయత్నం కేసులో మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంగళవారం 14 రోజుల రిమాండ్ విధించింది. 2022 అక్టోబరు 7వ తేదీన వెల్దుర్తి మండలం బోదలవీడుకు చెందిన టీడీపీ నాయకుడు దారపనేని శ్రీనివాసరావును వైసీపీ పార్టీలోకి మారాలని దాడి చేశారనే కేసులో కిశోర్‌పై వెల్దుర్తి పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇప్పటికే కారంపూడి కేసులో గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న కిశోర్‌పై వెల్దుర్తి పోలీసులు పీటీ వారంట్ కింద మాచర్ల కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్ ఈ మేరకు రిమాండ్ విధించారు. వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి ఎస్కార్ట్‌తో గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగించే వారికి అంబేడ్కర్ దేవుడు

● జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామ్‌చందర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వడ్డేపల్లి రామ్‌చందర్

తాడేపల్లి (ఉండవల్లి) , జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించే ప్రతి వ్యక్తికి అంబేడ్కర్ దేవుడే అని జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామ్‌చందర్ అన్నారు. మంగళవారం ఉండవల్లిలోని అంబేడ్కర్ సంస్థానంకు ఆయన విచ్చేశారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్‌చందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 338 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు వర్తించాల్సిన అన్ని వనరులు, ఉద్యోగాలకు సంబంధించి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పర్యటించామని తెలిపారు. పలు సమస్యలపై సమీక్ష చేసినట్లు చెప్పారు. ఉండవల్లి గుడిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలరాతి విగ్రహాన్ని సందర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో పోలీసులకు సూచనలు చేయడం జరిగిందన్నారు. 2018 నుంచి గవర్నమెంట్ గెజిట్ ప్రకారం అట్రాసిటీ కేసులలో అరెస్టులు, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోతే పోలీసులపై ఎస్సీ కమిషన్ యాక్షన్ తీసుకుంటుందన్నారు. ఇటీవల తెనాలిలో జరిగిన దాడిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కానీ ఈ కేసును సుమోటాగా తీసుకోవడం జరిగిందన్నారు. పలువురు బుద్ధిస్టులు, అంబేడ్కర్ వాదులు ఈ సందర్భంగా రామ్‌చందర్‌ను ఘనంగా సత్కరించారు.

విజ్ఞాన్స్ విద్యా సంస్థల సమన్వయకర్తకు..

శ్రీగురు పురస్కారం



గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్

గుంటూరు (విద్య)జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్స్ విద్యాసంస్థల సమన్వయకర్త, ప్రముఖ ప్రవచకులు, సంస్కృత అధ్యాపకులు గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్‌కు మంగళవారం శ్రీ గురు పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం వారు సాహిత్య రంగంలో విశేష కృషి చేయడంతో పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, బ్రాహ్మణ ధర్మములను సంరక్షించి వ్యాప్తి గావించినందుకు గాను "రామాయణ ప్రవాచక కంఠీరవ" అనే బిరుదుతో సత్కరించారు. నేటి యువతకు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను మరింత చేరువయ్యేలా కృషి చేస్తానని వెల్లడించారు. శ్రీ గురు పురస్కారం పొందిన విజ్ఞాన్స్ విద్యా సంస్థల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్‌ను విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రత్యేకంగా అభినందించారు.

మత్స్యకారులకు జెన్‌కో అధికారుల హెచ్చరిక

రెంటచింతల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో చేపల వేటకు వచ్చిన ఏడుగురు మత్స్యకారులను జెన్‌కో సెక్యూరిటీ అధికారులు మంగళవారం తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఈ ప్రాంతం చేపల వేటకు నిషిద్ధ ప్రాంతమని, 1900 హెక్టార్లలో ఉన్న రిజర్వాయర్‌లో మొసళ్లు సంచరించడం ఒక్కోసారి అవి ఒడ్డుకు చేరడం లాంటి ఘటనలు కూడా ఉంటున్నాయన్నారు. రిజర్వాయర్‌లో నీళ్లు పెరిగినప్పుడు అప్పటికప్పుడు రేడియల్ క్రస్ట్ గేట్లను ఎత్తడం జరుగుతుందని 3 కి.మీ మేర చేపల వేట నిషేధమని గుర్తు చేశారు. ఈ సారి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సెక్యూరిటీ అధికారులు హెచ్చరించారు.

రూరల్ ఎస్ఐగా సంధ్యారాణి



మాచర్లరూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రూరల్ ఎస్ఐగా గడ్డం సంధ్యారాణి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇప్పటివరకు మాచర్ల పట్టణ ఎస్ఐగా విధులు నిర్వహించారు. కాగా మాచర్లరూరల్ ఎస్ఐగా విధులు నిర్వహించిన నరసింహులు వీఆర్‌కు వెళ్లారు.

రోడ్డు పునర్నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఉంగుటూరు - కంభంపాడు రోడ్డు పునర్నిర్మాణానికి నాబార్డు ద్వారా రూ.2కోట్లు నిధులు మంజూరయ్యాయని టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు - కంభంపాడు రహదారి అధ్వానం అని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. నియోజకవర్గంలో అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కంభంపాడు రోడ్డుతో పాటు లోలెవల్ చప్టాను హైలెవల్ వంతెనగా నిర్మిస్తారన్నారు.

నేడు మునగోడు పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకారం

అమరావతి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మునగోడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని సీఈవో బీ సాంబశివరావు తెలిపారు. ఛైర్‌పర్సన్‌గా లింగాపురానికి చెందిన నాగోతు నాగార్జున, పర్సన్స్‌గా మునగోడుకు చెందిన షేక్ ఖాసీం షరీఫ్, అత్తలూరుకు చెందిన సీహెచ్ వెంగళరావులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరుకానున్నారు.

కిసాన్ మేళాను జయప్రదం చేయాలి

● ఏవో రామమ్మ

మాచవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి మార్కెట్ యార్డులో ఈనెల 17వ తేదీన జరిగే కిసాన్ మేళా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల వ్యవసాయ అధికారి రామమ్మ రైతులకు సూచించారు. ఈ కిసాన్ మేళా కార్యక్రమానికి రైతు శాస్త్రవేత్తల చర్చా గోష్టి, వ్యవసాయ ప్రదర్శనలు నిర్వహిస్తామని, వ్యవసాయ యంత్ర పరికరాల గురించి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. మండలపరిధిలోని అన్ని గ్రామాల రైతులు ఈ కార్యక్రమానికి వచ్చి జయప్రదం చేయాలని ఆమె కోరారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారానికి మూడో రోజుకు చేరింది. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో వంట వార్పు కార్యక్రమం చేపట్టగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతుగా వైసీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, చల్లా పిచ్చిరెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, చింతా సుబ్బారెడ్డి, వాసుదేవరెడ్డిలు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, మున్సిపల్ కార్మికులు వెంకయ్య, సారథి, మధుబాబు, వేమూరి శ్రీను, గదె పవన్ కుమార్, నాగుర్, హుస్సేన్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో హెచ్‌ఐవీ పరీక్షలు

సత్తెనపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో మంగళవారం లింక్ ఏఆర్‌టీ కేంద్రం నందు వైద్య పరీక్షలను ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవీతో బాధపడే వారు ఏఆర్‌టీ మందులు వాడటం ద్వారా ఎలాంటి ఇన్‌ఫెక్షన్‌లు సోకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల ఆర్ఎంవో కృష్ణమూర్తి, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తదతరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
● చాగల్లులో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



చాగల్లులో దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం నకరికల్లు మండలం చాగల్లులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అధికారులందరూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కన్నా ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. చాగల్లులో ప్రజలు కన్నాకు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటిలో సమస్యలను తెలుసుకొని వాటిని పై టీడీపీ యాప్‌లో స్వయంగా నమోదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన తో పాటు ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, పల్నాడు జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ ఆలీ బాషా, వేల్పుల ఆవుల రాజు, సాగి శ్రీను, తోట అంబిక, పూజల వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లికి జాతీయ స్థాయి అవార్డు

సత్తెనపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు కర్నాటి మురళీ జాతీయ స్థాయిలో అవార్డుకు ఎంపిక కావటం సత్తెనపల్లికే గర్వకారణమని ఎమ్మెల్యే కన్నా అన్నారు. మంగళవారం కర్నాటి మురళీ ఇంటికి వెళ్లి ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. మురళీ మరెన్నో అవార్డులు అందుకోవాలని కన్నా అన్నారు. కార్యక్రమంలో తురగ మేరీ గ్రేస్, మారెళ్ళ మల్లేశ్వరరావు, మస్తాన్‌వలి, నూర్ బాషా జాన్ బాబు, మారెళ్ళ స్వామి, గుంటూరు ఆశీర్వాదం, కోమటినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కన్నాను సన్మానించిన రవిచంద్ర

తెలుగుయువత సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా మండలంలోని కొమెరపూడికి చెందిన మొక్కపాటి రవిచంద్రను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా మంగళవారం రవిచంద్ర ఎమ్మెల్యే కన్నాను సత్తెనపల్లిలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి ఘనంగా సన్మానించారు. ఆయనను టీడీపీ నేతలు అభినందించారు.

పట్టణాన్ని అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదే

● యువ నాయకుడు యరపతినేని నిఖిల్



కామేపల్లికి చెందిన ఏసును పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని అన్నివిధాల అభివృద్ధి చేసిన ఘనత టీడీపీదేనని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణంలోని 2, 3 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాలు, సంక్షేమం గురించి వివరించారు. దేశంలోనే అద్భుతమైన పథకంగా తల్లికి వందనం నిలిచిందన్నారు. కూటమిలో జనసేన, బీజేపీ నేతలకు ప్రాధాన్యమిస్తూ మార్కెట్ కమిటీ పదవుల్లో చోటు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, ఏఎంసీ ఛైర్మన్ తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, కొక్కెర కొండలు, వాయిరి వెంకట్రావు, ఎల్‌వీఆర్, జొన్నలగడ్డ శ్రీను, బొల్లా శ్రీను, వున్నం సురేష్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పాతతరం నేతల కుటుంబాల్లో సంతోషం

నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా టీడీపీకి ఎమ్మెల్యే యరపతినేని వెన్నంటి నడిచిన పాతతరం నాయకులను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించడంతో పాటు తానే స్వయంగా ఆర్థిక సాయం అందించడం, మరికొంత మందికి తనవంతు సాయమందించేందుకు వీలుగా కుమారుడు నిఖిల్‌ను పంపడం నియోజకవర్గంలో పాతతరం నాయకుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుంది. నాలుగు రోజుల క్రితం కామేపల్లిలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో యరపతినేని కొందరిని పరామర్శించి సాయమందిస్తానన్న భరోసా ఇచ్చాడు. ఈ క్రమంలో కాటేపల్లి దిలీప్‌కు 20 వేలు, బడిగుంచల రంగయ్యకు 10 వేలు, బీసిపోగు ఏసుకు 10 వేలు, పాదర్తి పుల్లయ్యకు 5 వేలు, ఆలూరి హుస్సేనయ్యకు 5 వేలు, బాలరాజుకు 5 వేలు చొప్పున మంగళవారం నిఖిల్ సాయమందించడంతో ఆయా కుటుంబాలలో సంతోషం వ్యక్తమైంది.

దాచేపల్లి కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



దాచేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నూతన కమిషనర్‌గా జీ వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అమరావతి రాజధాని సెక్రటేరియట్ నుంచి బదిలీపై దాచేపల్లి కమిషనర్‌గా నియామకమయ్యారు. గతంలో ఇంటిలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన అనుభవం ఉంది. కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

సహకార సంఘ అధ్యక్షుడిగా తంగెళ్ళ

దాచేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహకార బ్యాంక్ దాచేపల్లి శాఖ ఛైర్మన్‌గా సీనియర్ టీడీపీ నేత, గ్రామ మాజీ సర్పంచ్ తంగెళ్ళ శ్రీనివాసరావును నియమిస్తున్నట్టు ప్రభుత్వం నుంచి నియామకపత్రాలు అందాయి. సభ్యులుగా నడికూడి గ్రామానికి చెందిన గోడ నారాయణ, కేసానుపల్లికి చెందిన షేక్ జానయ్యలు ఉన్నారు. అతడి నియామకంతో దాచేపల్లి మండల శ్రేణులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ పింఛన్‌లు ఇప్పిస్తాం

ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నా : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



నీలేశ్వరపాలెంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో వితంతువుకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, జూలై 15(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్‌లు ఇప్పిస్తామని, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని నీలేశ్వరపాలెంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజలతో మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేవూరి వెంకాయమ్మ, రేగులగడ్డ మల్లేశ్వరి, మేకల భూలక్ష్మి, ఎర్రకొర్ల నరసమ్మ తదితర వితంతువులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నామని, బాణావత్ బద్యానాయక్ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదంటూ ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ పింఛన్లు ఇప్పిస్తామని, ప్రజా సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, కిలారి రాజన్‌బాబు, వెనిగండ్ల కోటయ్య, నల్లమేకల వెంకటేశ్వర్లు, రామావత్ బాలానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసు

● తహసీల్దార్ పుల్లారావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎన్ఎస్‌పీ కాలనీలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

నకరికల్లు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్ర మించినా, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కే పుల్లారావు అన్నారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం యథేచ్ఛగా కబ్జా శీర్షికతో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం నకరికల్లులోని ఎన్ఎస్‌పీ కాలనీ ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఆక్రమణలకు గురైన స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ పట్టాల జారీ విష యమై విచారణ జరిపిస్తున్నామన్నారు. కారకులైన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని పుల్లారావు తెలిపారు. ఆయనతో పాటు ఆర్ఐ తోట సిద్దయ్య, వీఆర్‌వో పాశం శారద, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట పరమైన చర్యలు

● విజిలెన్స్ సీఐ ఎన్ఎస్ఎస్ అపర్ణ

నకరికల్లు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విత్తనాలను విక్రయించే విక్రయ దారులు నకిలీ విత్తనాలు అమ్మినా, నాసిరకం విత్తనాలు అమ్మినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ సీఐ ఎన్ఎస్ఎస్ అపర్ణ అన్నారు. మంగళవారం నకరికల్లులోని ఎన్ చిన్నయ్య అండ్ సన్స్ విత్తనాల షాపును ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సోర్స్ ఆఫ్ సప్లయ్, స్టాక్ బోర్డు, స్టాక్ రిజిస్టర్, విత్తన నిల్వలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందజేయాలన్నారు. విత్తనాలను నిర్ణీత ధరకు మించి అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తణిఖీల్లో వ్యవసాయ కమిషనరేట్ సహాయ సంచాలకులు కే కన్నయ్య, అచ్చంపేట, నకరికల్లు ఏవోలు పాల్గొన్నారు.

మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌లో తనిఖీలు



నడికూడిలో యూనిట్‌ను తనిఖీ చేస్తున్న రాష్ట్ర స్థాయి అధికారుల బృందం

దాచేపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి నగర పంచాయతీ నడికూడిలోని వ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్స్ ఐన షణ్ముఖ అగ్రిటెక్ నవభారత్ ఫెర్టిలైజర్స్ యూనిట్‌లను రాష్ట్ర స్థాయి అధికారుల బృందం తనిఖీ చేశారు. యూనిట్‌లో ఉన్న రిజిస్టర్స్‌ను, స్టాక్‌ను పరిశీలించారు. ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు అనుసరించి ఉత్పత్తులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ కే కన్నయ్య, విజిలెన్స్ సీఐ ఎన్ఎస్ఎస్ అపర్ణ, వ్యవసాయ శాఖ ఏవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్

దుర్గి, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి గ్రామంలో గల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మంగళవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. బూత్‌లో మార్పులు, చేర్పులపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఓటర్లకు అనుకూలమైన వాతావరణం, సకల సదుపాయాలు, సౌకర్యాలు, బాత్ రూమ్‌లు, నీటివసతి అందుబాటులో ఉన్నాయో లేదో పరిశీలించారు. 18 యేళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. మృతి చెందిన వ్యక్తులను రికార్డుల్లో నుంచి తొలగించాలని సూచించారు. ముటుకూరు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను సందర్శించి డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ వెంట సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్రావు, బీఎల్‌వోలు అనిల్‌శాస్త్రి, వీఆర్వోలు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పిల్లల సంరక్షణకు ఎన్నో చట్టాలున్నాయి

● మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి

సత్తెనపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పిల్లల సంరక్షణకు ప్రభుత్వం రక్షణ చట్టాన్ని, మరెన్నో చట్టాలను అమలు చేస్తుందని పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ ఎం ఉమాదేవి అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం పల్నాడు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో వివిధ చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పిల్లల ఆస్తులను పరిరక్షించటానికి, సంక్షేమాన్ని పరిరక్షించడానికి ఈ విభాగం పని చేస్తుందని తెలిపారు. బాల కార్మికుల వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనకు పని చేస్తుందన్నారు. బాలల పరిరక్షణ విభాగం పల్నాడు జిల్లా న్యాయ సలహాదారులు ప్రశాంతి, వాణిశ్రీలు పిల్లల సంరక్షణ గృహాలు, బాల న్యాయ వ్యవస్థ, ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంరక్షణ తదితర వాటిని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అరుణ, డీసీపీవో శౌరిరాజు, ఐసీడీఎస్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీదారుల ప్రవర్తన ఎలా ఉంది?

● డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి

రాజుపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ పంపిణీదారులు లబ్ధిదారుల గృహానికి వచ్చి పెన్షన్ అందజేస్తున్నారా, వారి ప్రవర్తన ఏ విధంగా ఉంటుంది అని పెన్షన్‌దారులను డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఝాన్సీరాణి మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయంలో పెన్షన్‌దారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె పెన్షన్ పంపిణీదారులు అవినీతికి పాల్పడుతున్నారా, డబ్బులు ఆశిస్తున్నారా అనే విషయాలను పెన్షన్‌దారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఐవీఆర్ఎస్ కాల్స్‌కి ఏ విధంగా స్పందన తెలియజేశారు అనే అంశంపై విచారించారు. ఎటువంటి ఐవీఆర్ఎస్ కాల్స్ తమకు రాలేదని కొంతమంది తెలుపగా తమ ఫోన్లు తమ వద్ద కాకుండా తమ కుటుంబసభ్యులు, బంధువుల వద్ద ఉన్నట్లు మరికొంతమంది తెలియజేశారు. ఈ సందర్భంగా పెన్షన్ పంపిణీదారులు ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారని, వారి ప్రవర్తన తమపట్ల చాలా బాగుందని ఎక్కువ మంది పెన్షన్‌దారులు తెలిపారు.

అన్ని వర్గాలకు నచ్చేలా.. జనం మెచ్చేలా కూటమి పాలన

● టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య

పెదకూరపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని వర్గాలకు నచ్చేలా, జనం మెచ్చేలా కూటమి పాలన సాగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్తిమళ్ళ రమేష్ అన్నారు. మండలంలోని చినమక్కెన గ్రామంలోని మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా?, కూటమి ఏడాది పాలన ఎలా ఉందంటూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, గంగినేని లీలావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి : మస్తాన్

బెల్లంకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం బెల్లంకొండలో సంవత్సర పరిపాలనలో కూటమి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు బెల్లంకొండలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ రజాక్, కొండవీటి అహమ్మద్, డీలర్ సుభానీ, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పాలువాయిలో తొలిఅడుగు

రెంటచింతల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని అందుకనే అధికారంలోకి రావడం తోటే సామాజిక పింఛన్లను ఏకంగా వెయ్యి రూపాయలను పెంచి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పాలువాయి సర్పంచ్ మందలపు విజయలక్ష్మీలచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మందలపు హనిమిరెడ్డి, సాంబ, తుఫాన్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్,(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పల్లెగుంత గ్రామ కూటమి నేతలు అన్నారు. మంగళవారం పల్లెగుంతలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు జాస్తి ప్రకాష్, వీరనారాయణ, పున్నయ్య, కన్నెగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సీడ్ రోడ్డు పక్కన అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ కోసం ఏర్పాటు చేస్తున్న పైపులు

స్పీడందుకున్న.. రాజధాని నిర్మాణ పనులు

● సంవత్సరంలోనే అందుబాటులోకి ప్రధాన రహదారులు

తుళ్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులు స్పీడందుకున్నాయి. సంవత్సరంలోనే ప్రధాన రహదారులు అందుబాటులోకి వస్తాయని టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు కంపెనీలు చెబుతున్నాయి. రాజధాని అమరావతి నగరం మాస్టర్ ప్లాన్ ప్రకారం 217 చదరపు కిలోమీటర్లుంటుంది. అందులో 360 కిలోమీటర్లు రహదారులుంటాయని సీఆర్డీఏ అధికారులు పేర్కొంటున్నారు. రైతుల ప్లాట్లలో రోడ్లు కాక ప్రధాన రహదారులు.. ఈస్ట్ నుంచి వెస్ట్ 16 రహదారులు .. నార్త్ నార్త్ నుంచి సౌత్‌కు 16 రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగు నీటి సరఫరా వర్షపు నీరు నిర్వహణ, విద్యుత్ కేబుల్ ఏర్పాట్లు రోడ్లు వెంబడి జరుగుతున్నాయి. రహదారుల కింద స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి బెటర్ ప్యాకేజీ ఇచ్చి సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు రాజధాని నిర్మాణానికి నిధులు సమకూరుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని నిర్మాణానికి భుజం కలుపుతాదని.. ప్రధాని మోదీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా రాష్ట్ర బడ్జెట్‌లో రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఇప్పటికే దాదాపు రూ.49 వేల కోట్ల విలువ కలిగిన నిర్మాణ పనులకు సీఆర్డీఏ పది కంపెనీలకు టెండర్లు కేటాయించింది.

నిర్మాణాలపైనే దృష్టి..

రెండవ విడత ల్యాండు పూలింగ్ విషయంపై హడావుడి వద్దని సీఎం చంద్రబాబు నాయుడు సీఆర్డీఏ అధికారులకు ఆదేశాలిచ్చారు. రాజధాని నిర్మాణ పనులు వేగవంతంపై దృష్టి సారించాలని చెప్పినట్టు తెలిసింది. పురపాలక శాఖ మంత్రి నారాయణ ఎప్పటికప్పుడు రాజధాని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తూ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ప్రధాన రహదారులు పూర్తి అయితే రాజధాని అమరావతి అభివృద్ధి 80శాతం జరిగినట్లేనని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్‌ని దృష్టిలో ఉంచుకొని 150 నుంచి 165 అడుగుల వెడల్పుతో ప్రధాన రహదారుల నిర్మాణం జరుగుతోంది. అవసరమైతే ఇంకా పెంచుకోవాలంటే పక్కన స్థలం రిజర్వు చేసి ఉంచారు. ల్యాండు పూలింగ్‌లో రైతుల నుంచి తీసుకున్న 34 వేల ఎకరాలలో 30 శాతం రహదారుల నిర్మాణానికి వాడుతున్నారు. ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి నిర్మాణానికి రోడ్డు వ్యవస్థే కీలకంగా ఉంది. రవాణా వ్యవస్థ సరిగా ఉంటే ఆ నగరం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని ప్రపంచంలో కొన్ని మహా నగాలను పరిశీలిస్తే తెలుస్తుంది. సీఎం చంద్రబాబు నాయుడు పలు దేశాలు పర్యటించి రోడ్డు వ్యవస్థను అద్భుతంగా అమరావతిలో రూపొందించారు.



ఎన్ 14 రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం ఏర్పాటు చేస్తున్న కాంక్రీట్ డెక్‌లు

విసిరితే..వికసిస్తాయి!

● విత్తన బంతులతో పర్యావరణ పరిరక్షణ
● విద్యార్థుల్లో ప్రేరణకు విశ్రాంత అధ్యాపకుడి కృషి
● ఇప్పటికే 60 వేల విత్తనాల సేకరణ
● రోటరీక్లబ్‌ల సహకారంతో విత్తన బ్యాంకుల ఆలోచన



విత్తనాలు సేకరిస్తున్న విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, చిలకలూరిపేట)

పర్యావరణ పరిరక్షణ స్పృహ ప్రతి ఒక్కరిలోనూ కలుగుతోంది. ప్రకృతిని కాపాడుకునేందుకు పర్యావరణ ప్రేమికులు విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తున్నారు. ఇందుకు అనువైన మార్గాల వైపు వారిని నడిపిస్తున్నారు. అందులో ముఖ్యంగా పచ్చదనం పెంపునకు విత్తన బంతుల తయారీ పద్ధతిని వారికి వివరిస్తున్నారు. ప్రత్యేకంగా సంరక్షణ అవసరం లేకుండా ప్రకృతి సిద్ధంగా త్వరగా పెరిగే మొక్కల విత్తనాలను సేకరిస్తున్నారు. వర్షాలు కురిసే ముందుగానే విత్తన బంతులను సిద్ధం చేసుకుంటున్నారు. వర్షాలు బాగా కురిసి నేల చల్లబడిన అనంతరం ఈ విత్తన బంతులను కందకాలు, గుట్టలు, కొండలు, సాగుకు పనికిరాని భూముల్లో విసిరేస్తారు. బంతుల్లో ఉన్న విత్తనాలు మట్టిలో కలిసిపోయి మొలకెత్తుతాయి.

సాధారణంగా విత్తనాల సేకరణ..

మన చుట్టూ ఉండే ప్రాంతాల్లోని చెట్ల కింద వాటి విత్తనాలు లభిస్తాయి. పార్కులు, రోడ్ల వెంబడి, మార్కెట్ యార్డులు, విద్యాసంస్థలు, ఖాళీ స్థలాలు, కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణాల్లో చెట్లకిందపడి ఉండే విత్తనాలను ఆసక్తిగల విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు సేకరిస్తున్నారు. అనంతరం వాటిని శుభ్రం చేసి ఆరబెట్టి.. ఎర్రమట్టి, వర్మీకంపోస్ట్ కలిపి సిద్ధంగా ఉంచుకుంటారు. ఖాళీ సమయాల్లో విత్తన బం తులను తయారు చేస్తున్నారు. ఒక బంతిలో రెండేసి చొప్పున విత్తనాలను పెట్టి.. ఆరబెడతారు. వర్షాలు కురిసి వాతావరణం అనుకూలంగా ఉన్న సమయాల్లో ఈ బంతులను నిర్దిష్ట ప్రదేశాల్లో చల్లుతారు. మొక్కలు మొలవని సందర్భాల్లో అవి మట్టిలో కలిసిపోయి బంతుల్లోని ఎరువు భూమిలో కలిసిపోతుంది.



దండా లక్ష్మీనారాయణ

చిలకలూరిపేటలో విశ్రాంత అధ్యాపకుడి కృషి..

చిలకలూరిపేటలోని కొన్ని విద్యా సంస్థల విద్యార్థులు, రోటేరియన్లు, విశ్రాంత అధ్యాపకులు విత్తన బంతుల తయారీకి సంసిద్ధమవుతున్నారు. రోటరీ క్లబ్ సభ్యుడు, విశ్రాంత అధ్యాపకుడు దండా లక్ష్మీనారాయణ స్వతహాగా పర్యావరణ ప్రేమికుడు. విత్తన బంతుల తయారీ కోసం.. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి సమాచారం సేకరించారు. పర్యావరణ ప్రేమికుడు, రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ సలహాదారు అంకారావుతో మాట్లాడి మరి కొన్ని విషయాలను తెలుసుకున్నారు. స్థానిక సీఆర్ కాలనీ వాకర్స్, గణపవరం హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి విత్తనాల సేకరణ, విత్తన బంతుల తయారీపై అవగాహన కల్పించారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని చైతన్య లిటిల్స్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు 45 మందితో కలిసి బస్సులో కోటప్పకొండకు వెళ్లి.. చుట్టూ ఉన్న చెట్ల కింద ఉన్న విత్తనాలను సేకరించారు. కొంతకాలంగా వివిధ చోట్ల వేప, తురాయి, రాగి, గానుగ, నేరేడు, నక్కేరు చెట్ల విత్తనాలను సేకరించారు. ఆయన ఇప్పటికే సుమారు 60 వేల విత్తనాలను సేకరించి స్థానిక రోటరీ క్లబ్‌లో ఉంచారు. ఈ వారంలో పలు విద్యాసంస్థల సహకారంతో సుమారు 30 వేల విత్తన బంతులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. విద్యార్థులను చైతన్య పరిచి విత్తన బ్యాంకులను నెలకొల్పితే ప్రయోజనం ఉంటుందని, ఇందుకు రోటరీ క్లబ్‌ల సహకారంతో విద్యా సంస్థల్లో ప్రచారం చేసి అవగాహన కల్పించేందుకు.. ఆసక్తిగా ఉన్నట్లు ఆయన తెలిపారు.



విత్తనాల సేకరణకు కోటప్పకొండ వెళ్లిన విద్యార్థులు

రైతులకు చేరువయ్యేనా..!

● తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● రైతుల్లో అవగాహన లోపంతో సేవలు అంతంతమాత్రమే
● ఉచితంగా విత్తన, ఎరువు, పురుగుమందు పరీక్షలు
● నాణ్యతను గుర్తిస్తే పంటలను రక్షించుకునే అవకాశం
● మట్టి నమూనా పరీక్షలకు గుంటూరు పంపాల్సిందే



తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో అగ్రిటెస్టింగ్‌ల్యాబ్



ల్యాబ్ ద్వారా పరీక్షించిన విత్తనాలకు వచ్చిన మొలకలు

తెనాలి రూరల్, జూలై15(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ప్రధాన భూమిక పోషించేది విత్తన ఎంపిక. విత్తనం మంచిదైతే చీడపీడలు తట్టుకుని పంటలు సమృద్ధిగా పండటంతో పాటు మంచి దిగుబడి వస్తుంది. ఆరుగాలం శ్రమించిన రైతుకు తగిన ఫలితం దక్కుతుంది. విత్తన ఎంపికలో అధిక శాతం రైతులు విత్తన డీలర్లనే నమ్ముతారు. వారు చెప్పిన మాటలు విని..మంచి దిగుబడి వస్తాయన్న ఆశతో విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. వాస్తవానికి భూమిని అనుసరించి దానికి అనువైన విత్తనాన్నే ఎంపిక చేసుకోవాలి. కొందరు డీలర్లు ఈ విషయాన్ని విస్మరించి, తక్కువ ధరలకు కొనుగోలు చేసిన నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతుంటారు. ధర తక్కువని రైతులు కూడా రసీదులు పొందకుండా కల్తీ, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతుంటారు.

అగ్రి ల్యాబ్‌లతో నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట

వ్యవసాయ రంగంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అగ్రి ల్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందు, ఎరువులను గుర్తించి.. రైతును నష్టపోకుండా చేయడమే లక్ష్యంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఈ ల్యాబ్‌లలో పరీక్షించి వాటి నాణ్యతను తేలుస్తారు. ఇందులో భాగంగా తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పూర్తి ఉచితం గానే పరీక్షలు చేసి నాణ్యతను కేవలం 15 రోజుల్లోనే సిబ్బంది రైతులకు వెల్లడిస్తారు. సాగుకు ముందే రైతులు వారు ఎంపిక చేసుకున్న విత్తనాల్లో కేజీ వంతున శాంపిల్ తీసుకుని, ల్యాబ్ సిబ్బందిని సంప్రదించాలి. ఆధార్ కార్డు జిరాక్స్ ఫోన్ నంబరు చెబితే పూర్తి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మొలక శాతం చెబుతారు. ఎరువులు, పురుగు మందుల వాడే విషయంలో కూడా తప్పనిసరిగా ల్యాబ్ సేవలు సద్వినియోగం చేసుకుంటే అన్నదాతలు కల్తీలకు ఆస్కారం లేకుండా మంచి దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

అవగాహన పెంచాలి

అగ్రి ల్యాబ్ ప్రారంభించిన నాటి నుంచి వీటి సేవలు పొందేవారు నామ మాత్రం గానే ఉన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర వంటి పంటలను రైతులు సాగుచేస్తుంటారు. సాగుకు ముందు వ్యవసాయశాఖ, ఇతర శాఖల అధికారులు రైతులతో సమావేశం నిర్వహించి, విత్తన పరీక్షలపై అవగాహన కల్పించడంలో ఆశించినంత ఫలితాలు సాధించలేకపోయారన్న ఆరోపణలున్నాయి.

భూసార పరీక్షలు అందుబాటులో లేవు

సాగు చేపట్టే ముందు.. భూసారం ప్రతి ఒక్క రైతు తెలుసుకోవాలి. సాగు ప్రారంభంలోనే మట్టి పరీక్షలు జరిపి, ఫలితాల ఆధారంగా పోషక లోపాలు ఉంటే నివారణ చర్యలు తీసుకోవచ్చు. విత్తనం మంచిది ఎంచుకున్నా భూమిలో పోషకలోపాలు ఉంటే సకాలంలో ఎదుగుదల లేక దిగుబడి తగ్గే ప్రమాదం ఉంటుంది. తెనాలి నియోజవర్గంలో మట్టి పరీక్షకంటూ ప్రత్యేక కేంద్రాలు లేవు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది.. పేర్లు నమోదు చేసుకున్న రైతుల వద్దకు వెళ్లి.. వారి భూముల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. వాటిని గుంటూరు పంపి ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఇందుకు సమయం కూడా ఎక్కువగా ఉండటంతో సకాలంలో లోపాలు గుర్తించే అవకాశం లేకుంది. దీంతో రైతులు ఈ పరీక్షలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. జింకు లోపం ఉన్న భూముల్లో పంటలు ఎదుగుదల తగ్గి రైతాంగానికి పెట్టుబడులు పెరుగుతున్నాయి. మట్టి పరీక్షలపై ప్రభుత్వం దృష్టిపెట్టి ఈ సౌకర్యాన్ని అగ్రి ల్యాబ్ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఏడీఏల నిరీక్షణ

● పోస్టింగ్ కోసం నలుగురు ఎదురు చూపులు
● 40 రోజులు దాటినా అధికారుల కటాక్షం కరువే

గుంటూరు సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న నలుగురు ఏడీఏ(అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)ల భవిష్యత్తు ఏమిటో ఎవరికీ అంతు పట్టకుండా ఉంది. బదిలీల ప్రక్రియ అధికారికంగా ముగిసి 40 రోజులు దాటినా ఈ నలుగురు ఏడీఏ లకు ఇంకా పోస్టింగ్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఫలితంగా నలుగురు అధికారులు త్రిశంకు స్వర్గంలో ఉండిపోయారు. వినుకొండలో పనిచేస్తున్న బోయపాటి రవిబాబు మొన్నటి బదిలీల్లో సత్తెనపల్లి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు సత్తెనపల్లి వస్తుందన్న ఆశతో ఉండగా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఆపేశారు. ఆయన అప్పటికే పనిచేస్తున్న వినుకొండకు మాత్రం రవి కుమార్‌ను ఏడీఏగా నియమించడంతో బోయపాటి రవిబాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మరో ఏడీఏ మస్తానమ్మ విషయంలో కూడా అదే జరిగింది. ఆమె నరసరావుపేటలో పనిచేస్తున్నారు. ఆమె స్థానంలో కేవీ శ్రీనివాసరావును నియమించారు. మస్తానమ్మకు మరో చోట పోస్టింగ్ వేసి రద్దు చేశారు. ప్రస్తుతం మస్తానమ్మ నరసరావుపేట జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారు. క్రోసూరు ఏడీఏ వి.హనుమంతురావు వేరే చోటికి వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు కూడా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో పాత స్థానంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఉన్న రమాదేవిని బాపట్ల రైతు శిక్షణా కేంద్రంలో తొలత నియమించారు. ఆ తర్వాత ఆ పోస్టింగ్ రద్దు చేశారు. ఇలా ఎందుకు పోస్టింగ్‌లు ఇచ్చారో.. ఎందుకు రద్దు చేశారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి వ్యవసాయ శాఖలో నెలకొంది.

సత్తెనపల్లిలో షాడో ఏడీఏ?

సత్తెనపల్లి ఏడీఏ నియామకం విషయంలో గత కొన్ని సంవత్సరాల నుంచి పెద్ద హై డ్రామా నడుస్తోంది. అక్కడకు ఎవరి నైనా నియమించినా రాకుండా అడ్డుకునే పరిస్థితి నెలకొంది. చివరికి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు ఇచ్చినా కూడా ఆ ఏడీఏ ను అక్కడ జాయిన్ కాకుండా అడ్డుకోవడం జరిగింది. ఆ స్థానంలో ఒక ఏఓ ఇంచార్జి బాధ్యతలు నిర్వహించడం వ్యవసాయ శాఖ లో అప్పటికీ ఇప్పటికీ చర్చనీయాంశమే. ప్రస్తుతం జరిగిన బదిలీ లలో మొదట సత్తెనపల్లి కి ఒక ఏడీఏ ను నియమించారు. తదుపరి ఇచ్చిన సవరణ ఉత్తర్వుల్లో మాత్రం ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. అక్కడ గతం లో మాదిరిగా ఎవరినైనా ఇంచార్జి గా నియమిస్తారా అన్న చర్చ జరుగుతుంది.

నాటి పాపం.. విద్యార్థులకు శాపం

● పిడుగురాళ్ల మెడికల్ కళాశాల నిర్మాణంలో వైసీపీ జిమ్మిక్కులు..
● ఎమ్మెల్యే యరపతినేని పరిశీలనలో అసలు నిజం..
● మరో రెండున్నరేళ్ల వరకు పనులు కొనసాగే అవకాశం..
● ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్లు దాదాపుగా లేనట్లే..

పిడుగురాళ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ప్రకటనలు ఇస్తూ రాష్ట్రంలో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో మెడికల్ కళాశాల భవనాలను మంజూరు చేశారు. పిడుగురాళ్లలో 2021 మేలో ఆనాటి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాతో కలిపి మెడికల్ కళాశాల, హాస్పిటల్ భవనాలను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు మొదట్లోనే మందగించి ఆరు నెలలపాటు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఆ తరువాత కాస్త పనులు పుంజుకున్నా మూడేళ్ల వరకు నిదానంగా కొనసాగుతూ వచ్చాయి. అనుకున్న గడువులోగా పని పూర్తికాకపోవడంతో.. మరికొంత గడువు కావాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం కోరింది. గత ఎన్నికల నాటికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.500 కోట్లలో సుమారు రూ.250 కోట్లనే ఖర్చు చేసిందే తప్ప.. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన వాటిలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఫలితంగా గతేడాది మార్చి నాటికి మొత్తం పనుల్లో ఆసుపత్రి భవనాలు 70 శాతం, వైద్య కళాశాల భవనాలు 50 శాతం, విద్యార్థుల వసతి గృహాలు 40 శాతం కలిపి మొత్తంలో సుమారు 40 శాతం ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేశారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు మాత్రం 80 నుంచి 90 శాతం పనులు పూర్తిచేశామని గొప్పలు చెప్పుకుంటూ ఎన్నికల ముందు ఓ బ్లాక్‌కు రంగులు వేసి, మెడికల్ కళాశాలను ప్రారంభించినట్లు శిలాఫలకం వేయించారు.



మెడికల్ కళాశాల భవనాలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు (ఫైల్‌ఫొటో)

యరపతినేని పర్యటనతో

కూటమి ప్రభుత్వం వచ్చాక మెడికల్ కళాశాల పనులు ఎంతవరకు పూర్తయ్యాయని తెలుసుకునేందుకు అధికారులతో కలిసి ఎమ్మెల్యే యరపతినేని గత నెల చివరి వారంలో మెడికల్ కళాశాల భవనాలను సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు 10శాతం పనులు పూర్తయ్యాయని, మొత్తం భవనాలను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మరో రెండున్నర సంవత్సరాలు పట్టే అవకాశం ఉంటుందని మెడికల్‌కళాశాల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాదికి అడ్మిషన్లు లేనట్లే..

కేంద్ర ప్రాయోజిత పథకం కింద కళాశాల ఏర్పాటుకు నిధులు మంజూరైనా వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు వీలుగా పనులు పూర్తి కాలేదు. ఈ ఏడాది అడ్మిషన్లు పిడుగురాళ్ల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో జరగాలంటే నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు నవంబరు నాటికి దరఖాస్తుచేయాల్సి ఉంటుంది. అందుకు తగ్గట్టు తరగతి గదులు, ఆసుపత్రిలో సౌకర్యాలు కూడా పూర్తి కావాల్సి ఉంది. వైసీపీ నేతలు 80 శాతానిపైగా పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లకు డోకా లేదని గొప్ప ప్రకటన ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. ఆనాటి పాలకుల పాపం, నిర్లక్ష్యం ఈ ఏడాదిలో అడ్మిషన్లు జరిగేందుకు వీలులేకుండా పోయింది.

మూసివేత దిశగా మాచవరం రైల్వే స్టేషన్

● స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పాటు
● కేవలం ఏడు ప్యాసింజర్ రైళ్లే ఆగేది
● సౌకర్యాలు లేక నిరుపయోగంగా స్టేషన్
● అవరోధాలు అధిగమించేనా?



మాచవరం రైల్వే స్టేషన్ భవనం

పొన్నూరు టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం మాచవరం రైల్వేస్టేషన్ అవరోధాలను అధిగమించలేకపోతోంది. ఈ రైల్వే స్టేషన్ స్వాతంత్రానికి పూర్వమే ఏర్పడింది. అనేక దశాబ్దాల పాటు ఎంతో మందికి ప్రయాణ సౌకర్యం కల్పించిన మాచవరం రైల్వే స్టేషన్ క్రమేణ మూసివేత దిశగా సాగుతోంది. రైలు సర్వీసులు తగ్గిపోవడం, ప్యాసింజర్ రైళ్లకు ఆదరణ తగ్గిపోవడం, సమీపంలో నిడుబ్రోలు, బాపట్ల స్టేషన్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ సౌకర్యం ఉండటంతో ఈ స్టేషన్‌కు ప్రయాణికుల సంఖ్య క్రమేణా తగ్గిపోతోంది. ఆదాయంలేని స్టేషన్లపై రైల్వే శాఖ శీతకన్ను వేయడంతో స్టేషన్ ఆలనా పాలన చూసేవారు కరువయ్యారు. దీంతో ఈ స్టేషన్లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రయాణికుల సంఖ్య రోజుకు 100లోపే ఉండటంతో టికెట్ బుకింగ్ కార్యాలయంలో సైతం రైల్వేశాఖ అవుట్సోర్సింగ్‌కు అప్పగించి చేతులు దులుపుకుంది.

ఏడు సర్వీసులతో సరి...

గతంలో విజయవాడ - చెన్నై ప్రధాన రైలు మార్గంలో ఉన్న మాచవరం రైల్వే స్టేషన్‌లో ఈ మార్గం నుంచి ప్రయాణించే ప్రతి ప్యాసింజర్ రైలు ఆగేది. ప్యాసింజర్ రైళ్లన్నీ ఈ స్టేషన్లో ఆగటంతో పొన్నూరు, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం వంటి గ్రామీణ మండలాలలో ఉన్న పలు గ్రామాల ప్రజలు ఈ స్టేషన్ ద్వారా రాకపోకలకు సాగించేవారు. విజయవాడ, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి వంటి సుదూర ప్రాంతాలకు కూడా రైలు సౌకర్యం ఉండడంతో ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగించుకునేవారు. క్రమేపీ రైల్వే శాఖ ప్యాసింజర్ రైళ్లను తగ్గించివేస్తుండటంతో ప్రయాణికులు తగ్గారు. ప్యాసింజర్ రైళ్లు లేకపోవడం ఈ స్టేషన్లో హాల్టుల సౌకర్యం లేకపోవడంతో స్టేషన్ వైపు ప్రయాణికులు రావడం తగ్గిపోయింది. అంతే కాకుండా సమీపంలో ఉన్న నిడుబ్రోలు, బాపట్ల రైల్వే స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టులు ఉండటంతో ఎక్కువ మంది ప్రయాణికులు ఆ స్టేషన్లకు వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లడం ప్రారంభించారు. మాచవరం రైల్వే స్టేషన్లో కేవలం విజయవాడ, ఒంగోలు, గూడూరు ప్రాంతాల నడుమ రోజు వారి ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లు మాత్రమే రోజు ఆగుతున్నాయి.



స్టేషన్ లెవెల్‌లో ఉన్న ప్లాట్ ఫామ్

గ్రామాల నుంచి ఈ ప్రాంతాలకు రోజువారి పనులపై వెళ్లేవారు, షటిల్ సర్వీసులు చేసే ఉద్యోగులు మాత్రమే ఈ ప్యాసింజర్ రైళ్లను వినియోగించుకుంటున్నారు. ఈ మార్గంలో నడిచే అన్ని ప్యాసింజర్ రైళ్లకు హాల్టు సౌకర్యం మాచవరం స్టేషన్లో కల్పిస్తే ప్రయాణికుల సంఖ్య పెరిగి ఆదాయం పెరుగుతుందని పలు గ్రామాల వాసులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యల తిష్ట

మాచవరం రైల్వే స్టేషన్‌లో సమస్యలు తిష్ట వేశాయి. స్టేషన్ ఆదాయం తగ్గిపోవడంతో రైల్వే శాఖ ఈ స్టేషన్ వైపు దృష్టి సారించడంలేదు. దీంతో స్టేషనుకు వెళ్లే ప్రధాన మార్గం కూడా మట్టిరోడ్డుగా మారిపోయి స్టేషన్‌కు వెళ్లే మార్గమంతా పిచ్చిచెట్లు మొలిచి ఈ మార్గం చిట్టడవిని తలపిస్తోంది. స్టేషన్లో ఆలనా పాలన లేకపోవడంతో ప్లాట్‌ఫాంపై పిచ్చి మొక్కలు మొలిచాయి. ప్లాట్‌ఫాం కూడా లోలెవెల్‌లో ఉండడంతో ప్రయాణికులు రైలు ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రైల్వే శాఖ రెండో ప్లాట్ ఫామ్ ఎత్తు పెంచినప్పటికీ ఆ వైపు వెళ్లడానికి నిర్మించిన బ్రిడ్జి కూడా సరైన మార్గంలేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. స్టేషన్లో తాగునీరు లేకపోవడం, ప్రయాణికులు వేచి ఉండే షెడ్లు ఏర్పాటు చేయకపోవడం వంటి సమస్యలు ప్రయాణికుల రాకపోకలను తగ్గిస్తున్నాయి. అంతేకాకుండా రాత్రివేళ వీధి దీపాలు లేకపోవడంతో స్టేషన్ ప్రాంతం నిర్మానుష్యంగా మారిపోతోంది. దీంతో కొందరు స్టేషన్ వేదికగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రైల్వేశాఖ అవరోధాలు అన్నింటిని అధిగమించి స్టేషనుకు పునర్ వైభవం లభించేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంత ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ఈ మాచవరం రైల్వే స్టేషన్ కనుమరుగైపోయే ప్రమాదం ఉందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చిట్టడవిని తలపిస్తున్న స్టేషన్ మార్గం

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కార్మికుల నిరవధిక సమ్మెతో ఒక్క పూటే తాగునీరు

నరసరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. సమ్మె మంగళవారం మూడో రోజుకు చేరింది. నీటి సరఫరాపై సమ్మె ప్రభావం కనిపిస్తోంది. రెండుపూటలా నీటి సరఫరాను ఒక పూటను తగ్గించారు. సచివాలయ ఇంజనీరింగ్ కార్యదర్శులతో నీటి సరఫరా చేస్తున్నారు. కనీసం తాగునీటి సరఫరాకు కూడా కాంట్రాక్టు కార్మికులు సహకరించడం లేదు. కార్మికులందరూ సమ్మెలో పాల్గొంటుండటంతో పుర ప్రజలకు తాగు నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

వినుకొండటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీ డిపో బుధవారం నిర్వహించి డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 1 గంట వరకు 9959225431 నంబరుకు ఫోన్ చేసి నియోజకవర్గంలోని ఏపీఎస్‌ఆర్టీసీ డిపోకు సంబంధించిన తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చన్నారు.

20న ఇండియన్ రెడ్ క్రాస్ సంఘం సమావేశం

చిలకలూరిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ అసోసియేషన్ కార్యవర్గ సర్వసభ్య సమావేశం ఈ నెల 20వ తేదీన సాయంత్రం 4గంటలకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటుపై చర్చ జరుగుతుందన్నారు. అలాగే సంఘం గత కార్యక్రమాలపై సమీక్ష చేయనున్నట్లు వివరించారు. గత కొంతకాలంగా రెడ్‌క్రాస్ సేవలు స్తబ్దంగా ఉన్నందున నూతన కమిటీ ఏర్పాటుచేసి సేవలను విస్తృతం చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సభ్యులు వచ్చేటప్పుడు తమ గుర్తింపు కార్డులు తీసుకు రావాలన్నారు. అలాగే నూతన సభ్యులుగా చేరదలచుకున్నవారు సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరవచ్చునని తెలిపారు.

ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

వినుకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కార్యాలయ ఆవరణలో ఏపీటీఎఫ్ వినుకొండ జోన్‌లోని ఐదు మండలాల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఉస్మాన్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, పూర్వపు అధ్యక్షుడు వీరపనేని చంద్రమౌళి ఆయా మండలాల ఏపీటీఎఫ్ కార్యకర్తలను ఎంపికచేశారు. వినుకొండ మండలం ఏపీటీఎఫ్ అధ్యక్షుడిగా ఎస్కే మొహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా మీసాల గోపి, శావల్యాపురం అధ్యక్షుడిగా సీహెచ్ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పొరెళ్ల తిరుమల గురుబాబు, నూజెండ్ల అధ్యక్షుడిగా బొప్పూడి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శిగా లక్కిరెడ్డి రామాంజి, ఈపూరు అధ్యక్షుడిగా శివానాయక్, ప్రధాన కార్యదర్శిగా పఠాన్ మహమ్మద్‌ఖాన్, బొల్లాపల్లి మండల అధ్యక్షుడిగా ఎస్కే మస్తాన్ షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా షేక్ సైదాలను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన సభ్యులను పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



విశ్రాంతి ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

విశ్రాంతి ఉద్యోగుల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

వినుకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హస్పటల్ సహకారంతో విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 40మందికి పైగా కంటి పరీక్షలు చేయగా అందులో 24 మందికి శుక్లాల ఆపరేషన్‌లు అవసరమని వాహనంలో వారిని తీసుకెళ్లి ఆపరేషన్ చేయడం జరుగుతుందని సంఘం అధ్యక్షుడు భువనగిరి సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కాళ్ల కృష్ణమూర్తి తెలిపారు.



టైర్లు చోరీకి గురైన బొలెరో వాహనం

నిలిపి ఉన్న బొలెరో వాహనం చక్రాలు, విలువైన సామగ్రి చోరీ

వినుకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల శివాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా వాహనాన్ని సంఘటనా ప్రాంతంలో వదిలి చికిత్స పొందుతుండగా దొంగలు చేతివాటం ప్రదర్శించారు. రోడ్డు పక్కన ఆపిన బొలెరో వాహనానికి వెనుక వైపు ఉన్న రెండు టైర్లతోపాటు విలువైన సామగ్రిని చోరీ చేయటంతో వెంకటేష్ బంధువులు లబోదిబోమన్నారు. మంగళవారం వాహనాన్ని తరలించేందుకు వినుకొండకు వచ్చి సెకండ్ హ్యాండ్ చక్రాలను అమర్చుకొని వాహనాన్ని తరలించారు.

అధ్వానంగా హైలెవల్ కాలువ

● పిచ్చిచెట్లతో పూడుకుపోయి మారిన రూపురేఖలు
● సాగునీరు అందక అన్నదాతలకు ఇక్కట్లు



పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన హైలెవల్ కాలువ

ఈపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా హై లెవల్ కాలువ మరమ్మతులకు నోచుకోకపోవడంతో దాని పరిధిలోని పొలాల రైతులు సాగునీరు అందక ఆవేదన చెందుతున్నారు. నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువ పరిధిలోని మండలంలో అంగలూరు మేజర్‌కు అనుసంధానంగా హైలెవల్ కాలువను ఏర్పాటు చేశారు. కాలువ పరిధిలో అందరూ చిన్న, సన్నకారు రైతులు ఉన్నారు. కుడి ప్రధాన కాలువకు ఆయకట్టు భూములు అయినప్పటికి చివర భూములకు సాగునీరు చేరకపోవడంతో హైలెవల్ కాలువ నిర్మించారు. అప్పటి నుంచి కాలువ నీటితో పంటలు పండించుకుంటున్నారు. అయితే కాలువలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో భూములు బీళ్ళుగా వదిలేశారు. మరలా సాగునీరు విడుదల చేయడంతో భూములను పండించుకుంటున్నారు. అయితే హైలెవల్ కాలువలు రూపుకోల్పోయాయి. కొందరు కాలువలను ఆక్రమించుకున్నారు. కొంతమేర కాలువలు ఉన్నప్పటికి నీరు వచ్చే పరిస్థితి లేదు. కెనాల్ కింద చిన్న, సన్నకారు రైతులు కావడంతో బాగుచేసుకునే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలను నియమించి కాలువలను అభివృద్ధి చేస్తున్నారు. వాటితో పాటు హైలెవల్ కాలువను కూడా అభివృద్ధి చేస్తే ఈపూరు, ఊడిజర్ల, యర్రబాలెంకు చెందిన సుమారు ఐదు వందల ఎకరాలకు నీరు అందించొచ్చు.



రూపురేఖలు కోల్పోయిన కాలువ

ప్రణాళికలు పంపాం: డీసీ చైర్మన్ వేణుగోపాల్‌రావు

మేజర్, మైనర్ కాలువలతో పాటు హైలెవల్ కాలువ అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రతిపాదిత పనులకు అనుమతి రాగానే కాలువలు తీయిస్తాం.

దోపిడీ చేసేందుకే మున్సిపాలిటీలో గ్రామాల విలీనం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు గణపవరంతో పాటు పసుమర్రు, మానుకొండవారి పాలెం గ్రామాలను దోపిడీ చేసేందుకే చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేశారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. మండలంలోని గణపవరంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణతో పాటు పలువురు దాతల విరాళాలతో నిర్మాణం చేసిన బస్ షెల్టర్‌ను, సుమారు రూ.7లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన కల్వర్టు, ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని బొడ్డురాయి సెంటర్‌లో జరిగిన సభలో ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ నెల రోజుల్లో మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాలను పంచాయతీలుగా మార్చే ప్రక్రియ జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజల కోరికమేరకు ఈ నిర్ణయం జరిగిందన్నారు. పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ-4 పథకం తొలి దశలో 15లక్షల పేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పేదరికం తగ్గి అన్నివర్గాలు అభివృద్ధి చెందాలంటే మరో 15సంవత్సరాలు కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలన్నారు. గ్రామంలో సాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ.34 లక్షలతో ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్టు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో భాష్యం రామకృష్ణ, ఆర్టీసీ ఈడీ నాగేంద్ర ప్రసాదు, వైద్యులు డాక్టర్ రామకృష్ణ, వీరశంకరరావు, ఎం.రమేష్, పారిశ్రామికవేత్త పేర్ని వీరనారాయణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ హిమవంతరావు, పార్టీ అధ్యక్షుడు బీ సత్యనారాయణ, కెల్లంపల్లి అచ్చయ్య నాయకులు కందుల రమణ, పెంటాల శేషయ్య, కంచర్ల శ్రీనివాసరావు, ఎస్.శ్రీను, బుచ్చయ్య, గగారిన్, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కొమ్మాలపాటి తదితరులు

సుపరిపాలన అందించడమే ఎన్‌డీఏ లక్ష్యం

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఈపూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 27వ వార్డు స్వీపర్స్‌కాలనీలో, ఈపూరు మండలంలోని వనికుంట, ఈపూరు గ్రామాలలో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు-ఇంటింటికి ప్రచారం కార్యక్రమంలో జీవీ పాల్గొన్నారు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలన లక్ష్యాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థిక భద్రత కోసం చేపట్టిన సూపర్‌సిక్స్ పథకాలు అన్నివర్గాలకు లబ్ధి చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వినుకొండకు ప్రత్యేకంగా శాశ్వత తాగునీటి పథకం కోసం రూ.210కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. మంత్రి నారాయణ సహకారంతో మూడు చెరువులను అనుసంధానించి ఒకే చెరువుగా ఏర్పాటు చేసి మూడు నెలల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలో పనులు పూర్తి చేస్తామని, ప్రతి ఇంటికి ఉచిత కుళాయిలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మూడు నెలల్లో కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాల పంపిణీ వేగవంతం చేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రావర్ల జగ్గారావు,సర్పంచ్ బి.సుబ్బయ్య,పాశం యలమంద, నర్రా కిశోర్, ఎ.కోటేశ్వరరావు, సి.మల్లయ్య, జె.మునలయ్య, కోటేశ్వరరావు, బొల్లా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

అగ్ని బాధితులకు చేయూత

వినుకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పట్టణంలోని హనుమాన్ నగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శివశక్తి లీలా ఆంజన్ ఫౌండేషన్ సౌజన్యంతో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మంగళవారం వంట సామాగ్రి, దుస్తులతో పాటు, ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీదుల విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఎమ్మెల్యే వితరణ

నరసరావుపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 20మసీదులలో విద్యుత్ బిల్లులు చెల్లింపునకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు రూ.లక్ష చెక్కును వితరణగా మంగళవారం అందజేశారు. మసీదుల కరెంట్ బిల్లుల నిమిత్తం ఒక్కొక్క మసీదుకు రూ.5వేలు వంతున ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి ఈ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మైనార్టీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు అభినందించారు.



మసీదు కమిటీ సభ్యులకు రూ.లక్ష చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, తదితరులు

తహసీల్దార్ కార్యాలయ మరమ్మతుల పరిశీలన

నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయం మరమ్మతు పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. కార్యాలయ ఆధునీకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

బీసీ కమ్యూనిటీ హాల్ కోసం స్థల పరిశీలన

నరసరావుపేటలో బీసీ కమ్యూనిటీ హాల్ కోసం పెద్ద చెరువు సమీపంలో రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్థల పరిశీలన మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో బీసీ సమాజానికి తమ సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకోనేందుకు సరైన వేదిక ఏర్పాటవుతుందన్నారు. స్థల పరిశీలన తర్వాత ప్రాజెక్టు కోసం డీపీఆర్ తయారీ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుందన్నారు. రిపోర్టు ఆమోదంపొందిన తర్వాత టెండర్ ప్రక్రియ, నిర్మాణ పనులు మొదలవుతాయని అధికారులు తెలిపారు. 2026 చివరి నాటికి ప్రాజెక్టు పూర్తి కావచ్చునన అంచనా వేశారు.

నియోజకవర్గ సీపీఐ కార్యదర్శిగా బూదాల ఎంపిక

వినుకొండ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) వినుకొండ నియోజకవర్గం సీపీఐ ఏరియా కార్యదర్శిగా బూదాల శ్రీనివాసరావుతో పాటు, పట్టణ కార్యదర్శిగా ఉలవలపూడి రామును కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ నెల 14,15 తేదీల్లో కారంపూడి రోడ్డులోని గోగినేని ఫంక్షన్ హాల్లో జరిగిన వినుకొండ నియోజకవర్గం మహాసభ సందర్భంగా నూతన కమిటీతోపాటు, సభ్యులను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఈ నూతన కమిటీలోకి ఏడుగురు సభ్యులతో పాటు ఇద్దరు ఆహ్వానితులు, 45మంది సభ్యులను ఎన్నుకున్నట్లు బూదాల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు.

భాషా నైపుణ్యాన్ని పెంచుకోవాలి: శ్రీధర్‌బాబు

నరసరావుపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భాషా నైపుణ్యాన్ని పెంచుకోవాలని మోటివేషనల్ స్పీకర్ కే శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కే.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ముందుండి నడిపించే నాయకుడికి భాషా నైపుణ్యం ముఖ్యం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, రోటరీ క్లబ్ సెక్రటరీ మునీందర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం కృష్ణారావు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రాథమిక పాఠశాలలను తీర్చిదిద్దాలి

● అకడమిక్ మోనటరింగ్ అధికారి పూర్ణచంద్రరావు

శావల్యాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన మోడల్ ప్రాథమిక పాఠశాలలను హెచ్‌ఎంలు సమర్థవంతమైన నిర్వహణతో తీర్చిదిద్దాలని అకడమిక్ మోనటరింగ్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. స్కూల్ లీడర్‌షిప్ అంశంపై పల్నాడు జిల్లాలోని 227మంది మోడల్ ప్రాథమిక పాఠశాలల్లోని హెచ్‌ఎంలకు శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామసమీపంలోని సంసిధ్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన కేంద్రంలో మంగళవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఎంఈవో పుసులూరి లలితాకుమారి మాట్లాడుతూ శిక్షణానంతరం హెచ్‌ఎంలు నేర్చుకొన్న అంశాలు పాఠశాలల్లో అమలుచేసి సర్వతోముఖాభివృద్ధిని సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై ఉందన్నారు.

పింఛన్ వేలిడేషన్ సవరణను రద్దు చేయాలి: రామకృష్ణ

నరసరావుపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతోపాటు ప్రవేశపెట్టిన పింఛను వేలిడేషన్ అమెండ్మెంట్ రద్దు చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ జీ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ పిలుపు మేరకు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రం నరసరావుపేటలో ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట లీగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన బీటెక్ సెకండియర్ చదువుతున్న విద్యార్థి భీమవరపు విశ్వత్‌రెడ్డి సోమవారం రాత్రి నుంచి కనిపించడం లేదని మొదటి పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఆచూకీ తెలిసినవారు ఫోన్ నెంబర్లు 9866 563997, 9848110325, మొదటి పట్టణ సీఐ 9440796224కు తెలియజేయాలని కోరారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

యడ్లపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బోయపాలెంకు చెందిన వ్యాపారవేత్త, ఎస్ఎం ఎచీవర్స్ ట్రస్టు అధినేత వడ్డేపల్లి శివనాగేశ్వరరావు జన్మదినంను పురస్కరించుకుని రెండు గ్రామాలలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత వంకాయలపాడులో, అనంతరం ఉప్పరపాలెంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు, మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ అందజేశారు.

'కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి'

నరసరావుపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. మంగళవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ మున్సిపల్ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మూడోరోజు కార్మికుల సమ్మె శిబిరాన్ని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయకుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

వేగంగా లక్ష్యాలను పూర్తి చేయాలి

డ్వామా పీడీ మూర్తి



యడ్లపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చేపట్టవలసిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా వేగంగా పూర్తిచేయాలని పల్నాడు జిల్లా డ్వామా పీడీ ఎస్ఎల్ మూర్తి ఆదేశించారు. యడ్లపాడు ఎంపీడీవో కార్యాలయాన్ని డ్వామా పీడీ మంగళవారం సందర్శించారు. ఉపాధి హామీ పనుల ప్రగతిపై సమీక్ష చేశారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ ప్రగతి తదితర విషయాలపై అధికారుల నుంచి వివరాలను తెలుసుకున్నాడు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 2.74లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉండగా ఆయా కార్డుల్లో 4.68లక్షల మంది శ్రామికులు ఉన్నారన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టవలసిన పనుల లక్ష్యం 45లక్షల పని దినాలు కాగా ఇప్పటికే 55.13లక్షల పని దినాలు కల్పించడం జరిగిందన్నారు. లక్ష్యానికి మించి ఉపాధి పనుల నిర్వహణ జిల్లాలో కొనసాగుతుందన్నారు. గతేడాది జిల్లాలో 740 గోకుల షెడ్లను ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేయగా 63 బేస్ లెవల్‌లో ఉండగా మిగిలినవన్నీ వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. పూర్తిచేసిన వాటికి బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. కాగా ఈ ఏడాది 912 గోకుల షెడ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. గత ఏడాది లక్ష్యాలను ఉపాధి అధికారులు వేగంగా పూర్తి చేయాలని, అలాగే ఈ ఏడాది లక్ష్యాలను కూడా సమాంతరంగా కొనసాగించాలని సూచించారు. ఉద్యాన పంటలకు ఉపాధి పథకం నుంచి నూరుశాతం రాయితీతో రైతులకు వివిధ పంటలు సాగుచేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 630ఎకరాలలో వివిధ రకాల పండ్లు, పూలతోటల్ని 582మంది రైతులు సాగుచేస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో 12రకాల పండ్ల సాగుకు అవకాశం ఉన్నప్పటికీ జిల్లాలోని నేల స్వభావం, వాతావరణం అనుకూలంగా ఉండే వాటిని మాత్రమే ప్రోత్సహించి రైతులు నష్టపోకుండా చూస్తున్నామన్నారు.



గ్రామస్థులు, పాఠశాల అభివృద్ధి సంఘం సభ్యుల అభిప్రాయాలను సేకరిస్తున్న నరసరావుపేట ఆర్డీవో మధులత

లూథరన్ పాఠశాల స్థలంపై విచారణ

● పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుపై ఆర్డీవో అభిప్రాయ సేకరణ

యడ్లపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాలపై వచ్చిన పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్డీవో సోమవారం విచారణ చేపట్టారు. పాఠశాల స్థలాన్ని ప్లాట్లుగా వేసి అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఏఈఎల్‌సీ సంస్థ ప్రతినిధులు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నరసరావుపేట ఆర్డీవో మధులత మంగళవారం పాఠశాల వద్దకు చేరుకుని క్షేత్రస్థాయి విచారణ చేశారు. పాఠశాల ప్రాంగణంలో పాఠశాల భవనం నిర్మించిన దాతల వంశీయులు, పాఠశాల అభివృద్ధి సంఘం సభ్యులు, పూర్వ విద్యార్థులు, గ్రామపెద్దలతోపాటు ఏఈఎల్‌సీ ప్రతినిధితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 1952లో గ్రామస్థుడు పోపూరి వెంకటసుబ్బారావు గ్రామ విద్యాభివృద్ధి కోసం సర్వే నం.333లో 0.88సెంట్ల భూమిని అందించగా అప్పటి గ్రామ పెద్దలు కమిటీగా ఏర్పడి పాఠశాలను నిర్మించారన్నారు. 1955లో ఏఈఎల్‌సీ సంస్థకు పాఠశాల నిర్వహణ బాధ్యతను మాత్రమే అప్పగించినట్లు తెలిపారు. 2004 నుంచి ఏఈఎల్సీ సంస్థ పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం చేపట్ట లేదన్నారు. పాఠశాల నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహించటంతో పాఠశాల మూతపడే పరిస్థితిలో ఉందన్నారు. ఏఈఎల్సీ సంస్థను పాఠశాల నిర్వహణ బాధ్యత నుంచి తప్పించాలని, పాఠశాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధమని గ్రామస్థులు ఆర్డీవోకు వివరించారు.

ప్లాట్లు వేయలేదు.. ఆర్డీవో

ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం ఆర్డీవో మధులత విలేకరులతో మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను, అభివృద్ధి సంఘం చేసిన అభివృద్ధిని పరిశీలించామన్నారు. పాఠశాల స్థలంలో ప్లాట్లు వేసి కబ్జా చేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, డీవై ఈవో సుభాని, తహసీల్దార్ విజయశ్రీ, ఎంఈవో నాగరత్నం, మండల సర్వేయర్ సురేంద్ర, హెచ్‌ఎం, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవాలయానికి కలశం, మకర తోరణాల వితరణ

యడ్లపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామంలోని శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన దాతలు సందర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ కత్తుల సాంబశివరావు, ధనలక్ష్మి దంపతులు, వారి కుమారులు లక్ష్మణకుమార్, రమణకుమార్‌లు ఆలయ అభివృద్ధికి రూ.90వేలు వెచ్చించి ధ్వజస్తంభానికి కలశం, అమ్మవారు, గణపతి స్వామివారికి మకర తోరణాలు చేయించారు. వాటిని మంగళవారం ప్రతిష్ఠించారు. గతంలోనూ వీరి కుటుంబం ఆలయం గోశాలలోని గోవులకు గ్రాసాన్ని అందించారు. ఆలయాన్ని సందర్శించి సమస్య తెలుసుకుని వెంటనే స్పందించిన దాతలకు ధర్మకర్త సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ధ్వజస్తంభం వద్ద దాతలు సాంబశివరావు, ధనలక్ష్మి

ఈవ్ టీజింగ్‌పై కఠిన చర్యలు: అర్బన్ సీఐ రమేష్

చిలకలూరిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు విద్యాసంస్థల వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఆకతాయిలపై కఠినచర్యలు చేపడుతున్నట్లు అర్బన్ సీఐ పి రమేష్ మంగళవారం తెలిపారు. ఈవ్ టీజింగ్ వచ్చిన పలు ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని పట్టణంలో గాంధీపేట, సుబ్బయ్యతోట, శారదా హైస్కూల్, ఈస్ట్ క్రిస్టియన్‌పేట, పండరీపురం తదితర చోట్ల గట్టి నిఘా పెట్టామన్నారు. ముందస్తు ప్రణాళికతో కొన్ని ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీమ్‌లు మఫ్టీలో ప్రతిరోజు నిఘా వేసి అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వరిలో విత్తన శుద్ధి చేసుకోవాలి: ఏవో

రొంపిచర్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వరిలో విత్తన శుద్ధి చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శివలలిత మంగళవారం తెలిపారు. మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా గురించి వివరించారు. ఖరీఫ్, రబీ సాగులో వ్యవసాయశాఖ అధికారుల సూచనలను పాటించాలని రైతులను కోరారు. ఎరువుల వాడకం తగ్గించి అధిక దిగుబడులు సాధించే విధానాన్ని తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రసన్న, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.